ఆదివారం

01-09-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 442 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com



## మహిళలపై నేరాలు

# ఆందోళనకరం

### వేగంగా విచారణ చేసి శిక్షలు పడాలి

### 2019లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు చట్టం తెచ్చాం

### న్యాయవ్యవస్థల జాతీయ సదస్సులో ప్రధాని మోడీ

ముందడుగు జాతీయం:

రోజురోజుకు దేశంలో మహిళలపై అఘాయిత్యాలు, నేరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ఆడవారిపై, చిన్నారులపై జరిగే దాడులపై వేగంగా విచారణ పూర్తి చేసి శిక్షలు విధించాలని ఆయన పేర్కొన్నారు. శనివారం భారత్ మండపంలో జిల్లా న్యాయవ్యవస్థలపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కళాశాలలో హత్యాచారం నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకొంది. "దేశంలో మహిళలకు భద్రత కల్పించేందుకు ఇప్పటికే చాలా చట్టాలున్నాయి. 2019లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు చట్టాన్ని పాస్ చేశాం. దీనికింద సాక్షులను రక్షించే కేంద్రాలను ఏర్పాటుచేశాం. జిల్లా పర్యవేక్షక బృందాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటిని తదుపరి మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అప్పడే మహిళపై నేరాల విషయంలో వేగంగా తీర్పులు వెలువడతాయి. నేడు ఆడవారు, చిన్నారులపై జరిగే నేరాలు సమాజంలో తీవ్ర ఆందోళనకరంగా మారాయి" అని ప్రధాని మోదీ అన్నారు. ఈ అమృత్‌కాల్ సమయంలో 140కోట్ల మంది దేశ ప్రజలు అభివృద్ధి చెందిన, సరికొత్త భారత్‌ను చూడాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం కేసుల విచారణలో జాప్యాన్ని తొలగించేందుకు వీలుగా తీసుకొన్న చర్యలను మోడీ వివరించారు. సుప్రీంకోర్టు 75 ఏళ్ల స్మారక చిహ్నం స్టాంప్‌ను ఆయన విడుదల చేశారు.

## ముందు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

# ఏర్పాటు చేయండి

### మహిళలకు భద్రతలో బెంగాల్ ప్రభుత్వం విఫలం

### మమతా బెనర్జీకి రెండో లేఖకు కేంద్రమంత్రి స్పందన





ముందడుగు జాతీయం:

పశ్చిమ్‌బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పంపిన రెండో లేఖపై కేంద్రమంత్రి అన్నపూర్ణ దేవి తీవ్రంగా స్పందించారు. అత్యాచార ఘటనలకు పాల్పడేవారిని శిక్షించేందుకు కఠినచట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని మమతా డిమాండ్ చేశారు. అలాగే నిర్దిష్ట కాలపరిమితిలో కేసుల్ని పరిష్కరించేలా ఆ చట్టం ఉండాలని మరోసారి తన లేఖలో అభ్యర్థించారు. వారం రోజుల కిందట ప్రధానికి మమతా తొలిసారి లేఖ రాసిన సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర మంత్రి అన్నపూర్ణ దేవి సోషల్ మీడియా వేదికగా లేఖను విడుదల చేశారు. బెంగాల్‌లో ఫాస్ట్ కోర్టులు ఉన్నా.. వాటి పనితీరు సరిగ్గా లేవంటూ ఆక్షేపించారు.

"కేంద్రం తీసుకొచ్చిన చట్టాలను రాష్ట్రప్రభుత్వం సరిగా అమలుచేస్తే.. అటువంటి నేరాలకు పాల్పడినవారికి కఠినమైన శిక్షలు పడతాయి. బాధితులకు సత్వర న్యాయం చేకూర్చే అవకాశం ఉంది. చట్టాల ప్రకారం నిర్దేశిత సమయంలోగా తుది తీర్పు దక్కాలంటే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ బాధ్యతలు సక్రమంగా పాటించాలి. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించి కఠినమైన చట్టాలు అమల్లో ఉన్నాయి. బెంగాల్‌లో మాత్రం ఫాస్ట్ కోర్టుల పనితీరు బాగోలేదు. దాదాపు 48వేలకుపైగా అత్యాచార, పోక్సో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని త్వరగా పరిష్కరించాలంటే అదనంగా మరికొన్ని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేయాలి. ఇవేవీ చేయకుండానే కేంద్రంపై విమర్శలు చేయడం సరైందికాదు. ముందుగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేయాలి" అని అన్నపూర్ణ దేవి పేర్కొన్నారు. మహిళలకు భద్రత కల్పించడంలో బెంగాల్ ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు.



### తెలంగాణలో పలు జిల్లాలో భారీ వర్షా లు

మిగతా 2లో



### సాకి చెరువు ఆక్రమణలపై నజర్

మిగతా 3లో




### నిజాయితీ పరులతోనే మంచి సమాజం

మిగతా 4లో

## రాహుల్ గాంధీ అమెరికా పర్యటన

- సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు డల్లాస్‌లో సమావేశం
- యూనివర్శిటీ విద్యార్థులతో సంభాషణ

ముందడుగు జాతీయం:

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. వాషింగ్టన్ డీసీ, డల్లాస్‌లలో జరిగే పలు ముఖ్య సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. ఇందులో టెక్సాస్ విశ్వవిద్యాలయంలో ఒక కార్యక్రమం జరుగనున్నది. రాహుల్ పర్యటనపై ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చీఫ్ శామ్ పిట్రోడా తెలిపారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా నియామకమయ్యాక రాహుల్ అమెరికాకు వెళ్లడం ఇదే తొలిసారి. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత అయినప్పటి నుంచి ఆయనతో మాట్లాడాలని ఎన్నారైలు, దౌత్యవేత్తలు, వ్యాపార ప్రముఖులు, అంతర్జాతీయ మీడియా నుంచి చాలా అభ్యర్థనలు వచ్చాయని పిట్రోడా పేర్కొన్నారు. సెప్టెంబర్ 8న డల్లాస్‌లో, సెప్టెంబర్ 9-10 తేదీల్లో వాషింగ్టన్ డీసీలో ఉంటారని తెలిపారు. డల్లాస్‌లో టెక్సాస్ యూనివర్శిటీ విద్యార్థులతో, విద్యా సంఘం ప్రతినిధులతో కలిసి సంభాషించనున్నట్లు తెలిపారు.



ముందడుగు
ఆదివారం, 01-09-2024, హైదరాబాద్



# తెలంగాణలో పలు జిల్లాలో భారీ వర్షాలు

## మరో రెండురోజులు వర్షా లు కురిసే అవకాశం

### వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ

ముందడుగు తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షా లు కురుస్తున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షా పాతం రికార్డయ్యింది. ఈ క్రమంలోనే వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. మరో రెండురోజులు పలుజిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ క్రమంలో రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది. శనివారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో అత్యంత భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల అతిభారీ వర్షా లు కురుస్తాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాలకు భారీ వర్షా లు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందంటూ రెడ్ అలెర్ట్ ప్రకటించింది.

# పలు దేశాలకు చైనాతో సమస్యనే

## భారత్‌కు ఉన్న సమస్య ఇంకాస్త ఎక్కువ

### కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు



ముందడుగు జాతీయం:

భారత్‌తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలు చైనా నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నాయని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాటితో పోలిస్తే భారత్‌కు ఉన్న సమస్య ఇంకాస్త ఎక్కువని తెలిపారు. ఆంగ్ల పత్రిక ఎకనామిక్ టైమ్స్ నిర్వహించిన ఈవెంట్‌లో ఈమేరకు ఆయన శనివారం మాట్లాడారు. సరిహద్దు వివాదం కారణంగా చైనాతో మనకు సమస్య ఉంది. అలాగని చైనాతో మనకు మాత్రమే కాదు. ప్రపంచంలోని పలు దేశాలూ తలనొప్పి ఎదుర్కొంటున్నాయి. ప్రపంచంలో ఏమూలలకు వెళ్లినా ఆ దేశం గురించి చర్చించుకుంటూ ఉంటారు. యూరప్ వెళితే చైనా నుంచి ఎదురవుతున్న ఆర్థిక, జాతీయభద్రత ముప్పు గురించి ప్రస్తావిస్తారు. అమెరికా వెళ్లినా ఇదే సమస్య. కాబట్టి చైనాతో భారత్‌కు మాత్రమే సమస్య అని భావించకూడదు'' అన్నారు.

'దశాబ్దాల క్రితం ప్రపంచదేశాలు చైనా సమస్యను పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు అదే పెద్ద సమస్యగా మారింది. ప్రపంచ దేశాలతో పోల్చినప్పుడు చైనాతో మనకున్న సమస్యను మరింత తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా సరిహద్దు పంచుకుంటున్నందున భారత్ వంటి దేశాలు అందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది'' అని జైశంకర్ పేర్కొన్నారు.

# బ్రెజిల్‌లో నిలిచిపోయిన ఎక్స్ సేవలు



ముందడుగు జాతీయం:

సామాజిక మాధ్యమం ఎక్స్ సేవలు బ్రెజిల్‌లో నిలిచిపోయాయి. ఆ దేశ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు టెలికామ్ విభాగం ఈ చర్యలు తీసుకొన్నట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది. దీంతో ఇక్కడి ప్రజలకు ఎక్స్‌లోకి లాగిన్ అవడం సాధ్యం కావడం లేదు. బ్రౌజర్‌ను రీలోడ్ చేసి లాగిన్ అవ్వండి అంటూ పదేపదే సందేశాలు కనిపిస్తున్నాయి. తమ దేశంలో బ్రెజిల్‌లో ఎక్స్ ఎటువంటి న్యాయ ప్రతినిధిని నియమించలేదు. దీంతో అక్కడి సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డె మోరాసే తక్షణమే ఎక్స్‌ను 24 గంటల్లో ఆపేయమని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వివాదం మొత్తం ఏప్రిల్‌లో మొదలైంది. దేశంలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్న పలు ఎక్స్ ఖాతాలను తొలగించాలని న్యాయస్థానం ఆదేశించడం వివాదానికి బీజం వేసింది.

# దొంగతనం చేశాడని కొట్టి, కారుకు కట్టేశారు

## గుజరాత్‌లోని గోద్రాలో సంఘటన

ముందడుగు గుజరాత్:

ఒక వ్యక్తి దొంగతనం చేశాడన్న ఆరోపణలపై షాపు యజమాని, అతడి అనుచరులు కలిసి ఒక వ్యక్తిని కొట్టారు. ఆ తర్వాత కారు బానెట్‌కు తాళ్లతో కట్టేశారు. ఆ కారుపై కట్టేసి ఉన్న అతడిని ఊరేగించారు. గుజరాత్‌లోని గోద్రాలో ఈ సంఘటన జరిగింది. కిషోర్ బాప్రీ అనే వ్యక్తి శుక్రవారం సీడ్స్, ఫెర్టిలైజర్స్ షాప్‌కు వెళ్లాడు. విత్తనాలు కొని డబ్బులు చెల్లించడం మరిచిపోయినట్లు అతడు చెప్పాడు. కిషోర్ తన షాపులో చోరీకి ప్రయత్నించినట్లు షాపు యజమాని గణపత్‌సింగ్ పర్మార్ ఆరోపించాడు. తన అనుచరులతో కలిసి ఆ వ్యక్తిని కొట్టాడు. ఆ తర్వాత కిషోర్‌ను కారు బానెట్‌కు తాళ్లతో కట్టేశారు. ఆ కారును నడిపి దానిపై కట్టేసి ఉన్న అతడ్ని ఆ ప్రాంతంలో తిప్పారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో పోలీసులు స్పందించారు. ఇరు వర్గాల ఫిర్యాదులపై వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. కిషోర్‌ను కారుపై కట్టేసి ఊరేగించిన షాపు యజమాని, మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ ఆరోపణలపై కిషోర్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ముందడుగు
ఆదివారం, 01-09-2024, హైదరాబాద్


## మాంటిస్సోరి విద్యా విధానంపై
# అవగాహన వాక్




ముందడుగు హైదరాబాద్ : డాక్టర్ మరియా మాంటిస్సోరి జన్మదినాన్ని పురస్కరించుకుని మాంటిస్సోరి ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మాంటిస్సోరి ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ మరియు అసోసియేషన్ మాంటిస్సోరి ఇంటర్నేషనల్ సమ్యుక్తంగా శనివారం హైదరాబాద్‌లో మాంటిస్సోరి వాక్ నిర్వహించాయి. మాంటిస్సోరి కాన్సెప్ట్ పై అవగాహన తీసుకురావడానికి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని 20కి పైగా మాంటిస్సోరి పాఠశాలల నుండి దాదాపు 300 మంది పిల్లలు మరియు పెద్దలు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని సంజీవయ్య పార్క్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి మాంటిస్సోరి ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ట్రైనింగ్ డైరెక్టర్ టీనాజ్ రిపోర్టర్ నాయకత్వం వహించారు. హైదరాబాద్‌లోని మాంటిస్సోరీ కమ్యూనిటీ నుండి వచ్చిన అపూర్వమైన స్పందన మాకు ఉత్సాహాన్ని నింపింది అని టీనాజ్ రిపోర్టర్ అన్నారు. మాంటిస్సోరి కాన్సెప్ట్ మరియు డాక్టర్ మరియా మాంటిస్సోరి వారసత్వాన్ని కొనసాగించడానికి పిల్లలు మరియు పెద్దలు కలిసి రావడం ఆనందంగా ఉంది అన్నారు.

## Patasala.inను కొనుగోలు చేసిన
# Schoolknot.com

### మా ఫీచర్లు, సేవలను మరింత మెరుగుపరుస్తాం




ముందడుగు హైదరాబాద్: ఎడ్యుకేషన్ టెక్నాలజీలో ప్రముఖ ప్లాట్‌ఫారమ్ అయిన Schoolknot.com, స్కూల్ ఈఆర్పీ సొల్యూషన్స్ సెక్టార్‌లో ప్రముఖ పేరు అయిన Patasala.in ను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ వ్యూహాత్మక చర్య ed-tech పరిశ్రమలో ఆధిపత్య శక్తిగా Schoolknot.com యొక్క స్థానాన్ని పటిష్టం చేయనుంది. ఈ సముపార్జనతో, Schoolknot.com దాని ప్రస్తుత 600+ క్లయింట్స్‌కు తోడు 150 క్లయింట్‌లు జత కలవగా, మొత్తం 750 మంది క్లయింట్‌లు ఇప్పుడు అసాధారణమైన స్కూల్ ERP సొల్యూషన్‌ల నుండి ప్రయోజనం పొందుతారు. Schoolknot.com సీఈఓ సికేందర్ షేక్ మాట్లాడుతూ "Patasala.in యొక్క సముపార్జన Schoolknot.comకి ఒక రూపాంతరమైన క్షణం, మా ఫీచర్లు మరియు సేవలను మెరుగుపరచడానికి అనుమతిస్తుంది. మరియు భవిష్యత్తు క్లయింట్లతో మాకు ఎక్కువ విలువను అందజేస్తోంది. పాఠశాల.ఇన్ సహ-వ్యవస్థాపకుడు అనిల్ మంగళంపల్లి ఈ విలీనంపై మాట్లాడుతూ "సముపార్జన వినియోగదారు ఇంటర్‌ఫేస్‌ను మెరుగుపరచడమే కాకుండా మొత్తం అనుభవాన్ని మెరుగుపరుస్తుంది అన్నారు.



# సాకి చెరువు ఆక్రమణలపై నజర్

## చర్యల కోసం అధికారులతో హైడ్రా కమిషనర్ చర్చ

### కోర్టు కేసులపై వివరాలు కోరిన రంగనాథ్ ▪ నక్కవాగు బఫర్ జోన్ ఆక్రమణలపై దృష్టి

ముందడుగు హైదరాబాద్: పటాన్ చెరు పట్టణ నడి బొడ్డున ఉన్న సాకి చెరువులోని ఆక్రమణలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. పటాన్ చెరు డివిజన్‌లోని సాకి చెరువును ఆయన శనివారం పరిశీలించి ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. చెరువులోంచి వేసిన రోడ్డు గుండా శాంతినగర్ కాలనీ ఎంట్రెన్స్‌లో ఆగి అక్కడున్న ఇండ్లను పరిశీలించి వాటి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ నిర్మాణాల్లో అధిక శాతం సాకి చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. కొందరు కోర్టులో కేసులు వేశారని వివరించారు. కోర్టు కేసుల వివరాలు తనకు తెలుపాలని సూచించారు. ఇప్పటికే 18 అక్రమ కట్టడాలు ఉన్నట్టుగా అధికారులు పేర్కొన్నారు. చాలా కాలం క్రితమే ఇండ్ల నిర్మాణం జరిగినట్టుగా ఉందని రంగనాథ్ అన్నారు. పూర్తి వివరాలు తీసుకుని చర్యలకు దిగుతామని ఆయన అన్నారు. సాకి చెరువు తూములు మూసివేసి ప్రముఖ నిర్మాణ సంస్థ అపార్టుమెంట్లు కడుతున్నదని పలువురు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. స్పందించిన రంగనాథ్ చెరువుకు సంబంధించి ఎలాంటి ఆక్రమణలున్నా పరిశీలించి, విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి వివరాలు అధికారులు సేకరిస్తారన్నారు. ఆరోపణలు వచ్చిన నిర్మాణానికి అనుమతులున్నాయని అధికారులు కమిషనర్‌కు తెలియజేశారు. నక్క వాగు బఫర్ జోన్‌లో భారీ అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నారని, నక్క వాగుకు వచ్చే కాలువలు గల్లంతయ్యాయని పలువురు విలేకరులు హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై కమిషనర్ తక్షణమే ఇరిగేషన్ శాఖ అధికారుల వివరణ తీసుకున్నారు. అక్కడ పర్మిషన్లు తీసుకుని నిర్మాణం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. అధికారులు పర్మిషన్లతో కొన్ని నిర్మాణాలున్నాయని సందేహాస్పదంగా వివరణ ఇవ్వడంతో ఆయన నక్కవాగుకు సంబంధించిన పూర్తి డిటైల్స్‌తో కూడిన నివేదిక ఇవ్వాలని కోరారు. అనంతరం, అధికారుల వద్ద ఉన్న సాకి చెరువు నక్షాను పరిశీలించి వాటిలోని ఆక్రమణలను తెలుసుకున్నారు.

## ఆక్రమణల చెరవీడిన అప్పా చెరువు

గగన్‌పహాడ్‌లోని అప్పా చెరువులో వెలిసిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు శనివారం కూల్చివేశారు. భారీ బందోబస్తు మధ్య చెరువును ఆక్రమించి నిర్మించిన 13 నిర్మాణాలను నేలమట్టం చేశారు. కబ్జాదారులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని నిలువరించి.. కూల్చివేతలను కొనసాగించారు. కాగా, సున్నం చెరువు, ఈదుల కుంటను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. ఆక్రమణలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న పద్మావతినగర్ బస్తీవాసులకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో కమిషనర్ రంగనాథ్ చెరువు పరిశీలనకు రావడంతో బస్తీవాసులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు.



ముందడుగు
ఆదివారం, 01-09-2024, హైదరాబాద్






# నిజాయితీ పరులతోనే మంచి సమాజం

**నిజాయితీపరుల సంఖ్య పెరగాలి ▪ అందుకే నిజాయితీ అధికారులకు సత్కారం**

## యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వినూత్న కార్యక్రమం

ముందడుగు ప్రత్యేకం:

అందరి నోట అవినీతి, లంచాలు అనే పదాలు మామూలైపోయాయి.. నిత్యం అవినీతి చేపలు చిక్కుతూనే ఉన్నాయి.. మళ్లీ లంచాల తీసుకునే వారి సంఖ్య మాత్రం నిత్యకృత్యమైపోయింది.. వేల రూపాయల జీతాలు తీసుకుంటున్న అధికారులు, సేవ చేయాల్సిన నాయకులు అవినీతి కూపంలో చిక్కుకుపోతున్నారు. అందుకే ఈ వ్యవస్థను మార్చే ప్రయత్నం కోసం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ముందడుగు వేసింది.. సమాజంలో నీతిగా, నిజాయితీగా సేవలు అందిస్తున్న వారిని గుర్తించి, వారికి మద్దతు ఇస్తూ నేటి తరం, రాబోయే యువతరం వీరి అడుగుజాడల్లో నడవాలని పరిచయం చేస్తోంది.. గత పన్నెండు సంవత్సరాల నుంచి ఒక మార్పు కోసం వినూత్న కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది సంస్థ..

### ప్రతి సంవత్సరం నిజాయితీపరులకు సత్కారం

ప్రభుత్వ అధికారుల, రాజకీయ నాయకులు అంటేనే అవినీతి పరులనే ముద్ర ఉంది.. కాని అందులో కూడా నీతిగా, నిజాయితీగా పనిచేసే అధికారులు, నాయకులు ఎంతోమంది ఉన్నారు. అలాంటి వారిని ప్రభుత్వ శాఖల వారీగా గుర్తించి వారికి మద్దతు పలుకుతున్నారు. వారిని ప్రతి సంవత్సరం గుర్తించి ఘనంగా సత్కరిస్తున్నారు. వాటితో పాటు నిజాయితీ జీవనం సాగిస్తున్న ఎమ్మెల్యేలను, గ్రామాల అభివృద్ధికోసం పాటు బడుతున్న సర్పంచ్‌లను, వ్యవసాయంపై ఆసక్తి పెరగాలని యువ రైతులను, వృద్ధ రైతులను సత్కరిస్తూ సమాజానికి పరిచయం చేస్తున్నారు.





### అందరూ అవినీతిపరులు ఉండరు

సమాజంలో అందరూ అవినీతిపరులు ఉండరు.. అలానే అంతా నిజాయితీపరులు ఉండరు.. అందుకే నిజాయితీ అధికారుల సంఖ్య పెరిగే దిశగా యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వినూత్న కార్యక్రమాలు చేస్తోంది. నీతిగా, నిజాయితీగా పనిచేస్తున్న రాజకీయ నాయకులకు, అధికారులను గుర్తించి వారికి సత్కరించి ఇప్పటి తరానికి పరిచయం చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతోంది.. ఈ కార్యక్రమం వల్ల మరికొంతమందిలో ఐనా మార్పు వస్తుందనే ఆశ ఉంది. గాంధీజీ కలలుగన్న గ్రామాలను మార్చే దిశగా మా ప్రయత్నం వినూత్నంగా నిరంతరం కొనసాగుతోంది..

- రాజేంద్ర పల్నాటి.
పౌండర్ యూత్ ఫర్ యాంటీ కరప్షన్

### నేడు పదిమంది నిజాయితీ అధికారులకు సత్కారం

ప్రతి సంవత్సరం ఆగష్టు చివరి వారంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పది మంది నిజాయితీ అధికారులను గుర్తించి వారిని సత్కరిస్తున్నాం. అదివారం జరిగే నిజాయితీ అధికారుల ఆత్మీయ సత్కారంలో వి. ప్రవీణ్‌రావు, మాజీ వైస్ ఛాన్సలర్, డా. రామకృష్ణ, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్. ఎం. మాధవరెడ్డి బ్యాంక్ ఆప్ బరోడా జనరల్ మేనేజర్, శివప్రసాద్ జాయింట్ కమిషనర్ సెర్ప్, ఎ. నాగేంద్ర రిటైర్డ్ జాయింట్ కలెక్టర్, కరుణ ఏఓ, టి. నరేష్ అటెండర్, అమ్రేష్‌కుమార్, రిటైర్డ్ ఏడీఏ, వై. శ్రీనివాస్‌రావు, వెటర్నరీ డిపార్ట్‌మెంట్, ఎ. గోపాల్‌రావు మాజీ సీఎండీ ఎన్‌పిడిసిఎల్, యాదగిరిరెడ్డి తహశీల్దార్ శామీర్‌పేట్, బి. నాగార్జున సిఐ కల్వకుర్తి.. సత్కరిస్తున్నామని తెలిపారు.

ముందడుగు
ఆదివారం, 01-09-2024, హైదరాబాద్

# సమంత నాకు క్లోజ్

సినిమాలతో కంటే విభిన్నమైన డ్రెస్సింగ్‌తో పాపులారిటీ తెచ్చుకున్నది ఉర్ఫీ జావేద్. ఆమె లైఫ్ స్టైల్ మిగిలిన నటులకన్నా భిన్నంగా ఉంటుంది. 'ఫాలో కర్‌లో యార్' టైటిల్‌తో ఆమె జీవిత కథ వెబ్ షోగా రూపొందింది. ఇది 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సిరీస్ ప్రమోషన్లలో బిజీగా ఉన్న ఉర్ఫీ.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో సమంత గురించి సంచలన వ్యాఖ్యలు చేసింది. 'నేను చేసిన వీడియో నచ్చితే సమంత తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తుంది. దీని వెనుక ఆమెకు ఎలాంటి ఉద్దేశం ఉందని అనుకోవడం లేదు. ఆమెతో ఇన్‌స్టాగ్రామ్‌లో పలుసార్లు మాట్లాడాను. సమంత, నేను స్నేహితులం' అని చెప్పుకొచ్చింది. అంతేకాదు, అర్జున్ కపూర్ అంటే తనకు చాలా ఇష్టమనీ, ఆయనపై ప్రేమ ఉందని కామెంట్ చేసింది. వెరైటీ డ్రెస్సులతో నిత్యం వార్తల్లో నిలిచే ఈ బ్యూటీ ముక్కుసూటిగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో రోజూ ట్రెండింగ్‌లో ఉంటుంది.





# విశ్వనాథ్ సినిమా గుర్తొస్తుంది

'మన భారతీయ సమాజంలో 22 ఏండ్లకే పెళ్లెప్పుడని అడుగుతుంటారు. అందుకే హౌస్‌వైఫ్ (గృహిణి) పాత్ర చేయడం ఇబ్బందిగా అనిపించలేదు. ఓ నటిగా అన్ని రకాల పాత్రలు చేయాలన్నదే నా అభిమతం' అని చెప్పింది కథానాయిక నివేతా థామస్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న '35-చిన్న కథ కాదు' ఈ నెల 6న ప్రేక్షకుల ముందుకురానుంది. కిషోర్ ఈమాని దర్శకుడు. ఈ సందర్భంగా శనివారం నివేతా థామస్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు...

ఈ సినిమాలో నేను సరస్వతి పాత్రలో కనిపిస్తా. మదర్ క్యారెక్టర్ చేయడం సవాలుగా తీసుకున్నా. నటిగా ఓ మూసలో ఇమిడిపోవడం నాకు ఇష్టం ఉండదు. నేను ఎలాంటి పాత్రనైనా చేయగలనని దర్శకులు నమ్మితే అంతకు మించిన ఆనందం ఏముంటుంది (నవ్వుతూ).

ఈ సినిమాలో సరస్వతికి చిన్న వయసులోనే పెళ్లవుతుంది. తనకు పిల్లలు ఉన్నప్పటికీ ఆమెలో ఇంకా చైల్డ్ నేచర్ కనిపిస్తుంటుంది.

తిరుపతి నేపథ్యంలో నడిచే ఈ కథ మధ్యతరగతి భావోద్వేగాలు, సంఘర్షణలకు అద్దం పడుతుంది. తిరుపతి బ్యాక్‌డ్రాప్ కాబట్టి అంతర్లీనంగా ఆధ్యాత్మిక భావాలతో కూడిన ఫ్యామిలీ డ్రామాగా మెప్పిస్తుంది.

తారే జమీన్ పర్' చిత్రంతో ఈ సినిమాకు అస్సలు పోలిక ఉండదు. లెక్కల సబ్జెక్ట్‌లో పిల్లలకు చాలా సందేహాలుంటాయి. ఈ సినిమాలో మా పెద్దబ్బాయికి మ్యాథ్స్ అంటే కష్టంగా అనిపిస్తుంటుంది. ఈ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతాయి.

భార్య, భర్త , పిల్లలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య అందమైన అనుబంధాన్ని ఆవిష్కరిస్తుంది. కె.విశ్వనాథ్‌గారి సినిమా చూసిన అనుభూతినందిస్తుంది.

ప్రియదర్శి ఈ సినిమాలో లెక్కల మాస్టర్ చాణక్యగా కనిపిస్తారు. గౌతమి, భాగ్యరాజా వంటి సీనియర్స్‌తో నటించడం వల్ల ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నా. సురేష్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను ప్రజెంట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రస్తుతానికైతే తెలుగులో ఏ సినిమా కన్‌ఫర్మ్ కాలేదు. ఆ వివరాలను త్వరలో తెలియజేస్తా.